# సూపర్ వైజరుగారు బదిలీ చేయబడ్డారు

## ఎందుకో, ఏమిటో?

★

క్యాంపునికి బట్టలకోటా వచ్చిందని తెలియగానే అందరి మొహాలు కలకల్లాడాయి. చలికి వణికిపోతూ శశికూడా అనుకున్నాడు యీసారితో తన చలిబాధ కొంచమయినా నివారణ అవుతుందని—అయితే జీతాల్నిబట్టి కోటాను విభజించే స్టోరుకమిటీ దృష్టిలో శశిలాంటి నౌకర్లకు గుడ్డ అంత అవసరంగా కనిపించలా....దాంతో ఆరాత్రి రాత్రే కోటాఅంతా విభజించి, చేరవలసిన చోట్లకు గప్‌చిప్‌గా చేర్చారు స్టోరుకమిటీవాళ్లు-

ప్రొద్దున్నే తన కోటా తీసుకుందామని శశి నెలలుగా కూడబెట్టిన డబ్బు తీసుకొని, సరిపోతుందో సరిపోదో అని సంశయిస్తూ వచ్చాడు స్టోరుకు—శశిని చూడ్డంతోటే గుమాస్తాగారు తోక తొక్కిన త్రాచై "ఫో! నీకీసారి కోటాలో ఏమీ రాలేదు- వచ్చేసారి కోటాలో మిగిల్తే యిస్తాంలే-చూస్తావేం! కదులూ" అని గదిమారు.

పది, పదిహేనుసార్లు విన్నాడు యిలాటి మాటలు శశి—తనకుగాను కోటా గవర్నమెంటువాళ్ళు యెప్పుడు పంపుతారో అర్థంకాలా అతనికి ....దీంట్లో ఏదో కుంభకోణం వుందిరా బాబూ అనుకున్నాడు. ఉన్నా చేసేదేమిటి! ఏ దొరగారితో చెబితే యేమవుతుందో....అయినా వచ్చేసారి కోటా వచ్చేదాకా తాను వణుకుతూ గడిపే భయంకరమైన రాత్రిళ్లో-వచ్చే కోటాలోమాత్రం తనకు పాలుంటుందని గ్యారంటీ యేముంది....? తనలాంటివారిని ఉద్ధరించడానికి, సంస్కరించడానికి, నాగరీకుల్ని చెయ్యడానికని పంపబడిన యీ ఆఫీసరుదొరలు యింతస్వార్థపరులైతే తనలాటి కొండజాతివాళ్ళు బాగుపడేదేమిటి? ఎన్నాళ్ళని కాచుక్కూచోటం? రెండేళ్ళ నౌకరీ ఫలితంగా సూపర్‌వైజరుగారి భార్యధర్మమా అని నేర్చిన తెలుగు తప్ప తాను యేమి మారాడూ....రెండేళ్ళ నౌకరీకి ఫలితంగా చలికి వణికిపొయ్యే తనకు ఒక్క చొక్కాగుడ్డ ఈయలేని యీ ప్రభుత్వం, ఆఫీసర్లు, నాగరికత యేమిస్తుందీ-నాగరికతంటే యిదే కాబోలు!—తోటిమానవుడు చచ్చిపోతున్నా లెక్కచెయ్యని స్వార్థపరత్వం—ఏమైనా సరేనని తెగించిచెప్పాడు సూపర్‌వైజరు దొరగారితో తమకు జరిగే అన్యాయం—

ఆయనమాత్రం యేం చేస్తాడూ!—విన్నాడు. జరిగేది అన్యాయమని స్పష్టంగా కనిపించింది—పోనీ తాను సరాసరి యింజనీరుగార్ని అడుగుదామంటే, చాటుగా వ్రాసే వార్షికపు రిపోర్టులో యేంవ్రాస్తాడో....యేమయితే కానీమని అడిగాడు, స్టోరు అధికారి యింజనీరుగార్ని....

"చూశారూ! మా అన్నయ్య అల్లుడికి బట్టలు కొంచ తక్కువగా ఉన్నాయట....యేదో యీ కోటాలో సరిపెట్టేశాను...వచ్చే కోటాలో మీ శశి కిస్తాంలెండి" అన్నాడు నవ్వుతూనే—

సూపర్‌వైజరుగారు యేం జవాబు చెప్తితే యేం తప్పో అని మళ్ళీ మాట్లాడలా—యింటికొచ్చి తనవంతు కోటా శశి కిచ్చేశారు.

యింజనీరుగారు, యేమనుకున్నాడో యేమో కాని, వారం తిరిగేటప్పటికి సూపర్‌వైజరుగారు బదిలీచేయబడ్డారు.

★ చివుకుల శంకరశాస్త్రి ★